సీఎంఆర్ ఎగవేత.. భారీగా మేత

- టాప్ 20లో వనపర్తి మిల్లులు
- రంగంలోకి దిగిన ఈడీ



పెబ్బేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి తీసుకొన్న ధాన్యంలో బియ్యం రూపకంగా (సీఎంఆర్) తిరిగి ఇచ్చే విషయంలో జిల్లా మిల్లర్ల యజమానులు రాష్ట్ర స్థాయిలో భారీ ఎగవేతదారుల జాబితాలో (టాప్ 20లో) చోటు దక్కించుకోవడం సంచలనంగా మారింది. పౌరసరఫరాల శాఖ అధికారుల హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయని వీరిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కన్ను పడింది. జిల్లాలోని మూడు ప్రధాన బియ్యం మిల్లులకు నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

రూ.470 కోట్లకు రికవరీ అంతంతే..!

● 2022- 2023 యాసంగికి సంబంధించిన టెండర్ ధాన్యంలో జిల్లాలోని బియ్యం మిల్లర్లు రూ.470 కోట్ల విలువ గల ధాన్యం ప్రభుత్వం నుంచి తీసుకున్నారు. బాగాలేదని చెబుతూ.. కేటాయించిన ధాన్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించారు.

● ప్రభుత్వానికి భారీగా చెల్లించాల్సిన వాటిలో మూడు బియ్యం మిల్లులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. కొత్తకోట మండలం మహాలక్ష్మి ఇండస్ట్రీస్ రూ.34 కోట్లు, వనపర్తి మండలం రిలిక్ బియ్యం మిల్లు నుంచి రూ.31 కోట్లు, శ్రీరంగాపూర్ మండలంలోని అల్ అజీజ్ బియ్యం మిల్లు రూ.31 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

● టెండర్ ధాన్యం 110 బియ్యం మిల్లులకు కేటాయించగా.. 18 మిల్లులు పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 92 మిల్లులు చెల్లించాల్సి ఉంది. ● 2022-2023 యాసంగి సీజన్‌కు గానూ నాలుగు బియ్యం మిల్లులు 50 శాతం చెల్లించాయి. వాటిలో సప్తగిరి, లక్ష్మీనర్సింహ, సింధు, శిర్డీ సాయి బియ్యం మిల్లులు 50 శాతం నగదును చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగతావి 20 శాతం నుంచి 30 శాతం వరకు చెల్లించారు. రూ. 470 కోట్లలో రూ.40 కోట్లు చెల్లించగా.. రూ. 430 కోట్ల బకాయి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

నిఘా — నిండా నిర్లక్ష్యం

గడువు ముగిసినా.. సీఎంఆర్ చెల్లించని మిల్లులకు మళ్లీ ఎందుకు ధాన్యం కేటాయించారనేది ప్రశ్నార్థకంగా మారింది. కొల్లగొట్టిన ప్రజాధనాన్ని రికవరీ చేయడంలో.. బినామీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయడంలో పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పని చేసిన వారు యజమానులకు పూర్తి స్థాయిలో సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈడీ నేరుగా రంగంలోకి దిగి సోదాలు నిర్వహించి అక్రమార్కుల ఆస్తులను అటాచ్ చేసుకునే విధంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

వారంలో రూ.వంద కోట్లు వసూలు చేస్తాం.. బియ్యం మిల్లుల యజమానులకు ప్రభుత్వం అవకాశం కల్పించినా.. వారు సద్వినియోగం చేసుకోలేదు. వారం రోజుల్లో రూ.వంద కోట్లు రికవరీ చేస్తాం. ప్రతి ఒక్క మిల్లు నుంచి వసూలు చేస్తాం. ఉన్న బకాయిల్లో సోమవారం లోగా చెల్లిస్తే 50 శాతం, సెప్టెంబరు చివరి నాటికి చెల్లిస్తే 75 శాతం, అక్టోబరు చివరి నాటికి చెల్లిస్తే వంద శాతం చెల్లించాలనే ఆదేశాలు ఉన్నాయి. యజమానులు ఏ అవకాశం కోరుకుంటే అదే కల్పిస్తాం.- **ఆంజనేయులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాలు



వంగూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 1-5 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ నకినమోని శేఖర్ తెలిపారు. ఐదు రోజుల పాటు వైభవంగా జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. నాలుగు రోజుల పాటు కల్వకుర్తి, అచ్చంపేట తదితర డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు తదితర సదుపాయాలు కల్పించామన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సర్దుబాటులో అదే తడబాటు

డిప్యుటేషన్లపై ఉపాధ్యాయుల్లో ఆసక్తి లేమి

న్యూస్‌టుడే పరిశీలన

అచ్చంపేట, కల్వకుర్తి గ్రామీణం, కొల్లాపూర్ న్యూటౌన్, బల్మూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల నిష్పత్తి ఆధారంగా ఖాళీగా ఉన్న పాఠశాలలకు మిగులు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపేందుకు పాఠశాల విద్యాశాఖ సర్దుబాటు ప్రక్రియను చేపట్టింది. కానీ, క్షేత్రస్థాయిలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు సమీపంలోని పాఠశాలల ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కొత్త పాఠశాలలో నివేదికలు, దస్త్రాల నిర్వహణ, ఆన్‌లైన్ డేటా నమోదు తదితర అంశాల్లో గందరగోళం నెలకొంది.

ఇదీ పరిస్థితి

● అచ్చంపేట మండలంలోని 57 పాఠశాలల్లో 3,043 మంది విద్యార్థులున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 25 మంది ఎస్జీటీలను సర్దుబాటులో భాగంగా ఇతర బడులకు కేటాయించారు. ఎనిమిది మంది స్కూల్ అసిస్టెంట్లను అవసరమున్న పాఠశాలలకు కేటాయించారు. ఎస్ఏలు కొత్త పాఠశాలలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.

● అచ్చంపేట జడ్పీ బాలికల పాఠశాల నుంచి ఎస్ఏ(గణితం)ను నడింపల్లి జడ్పీహెచ్ఎస్‌కు కేటాయించారు. బొమ్మన్‌పల్లి ఉన్నత పాఠశాలకు భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రం ఎస్ఏలను కేటాయించారు.

● కోడేరు మండలంలోని ఐదు పాఠశాలల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించారు. నాగులపల్లి యూపీఎస్ నుంచి బావాయిపల్లి పీఎస్‌కు ఒకరు, కోడేరు నుంచి పస్పుల యూపీఎస్‌కు ఒకరు, జనంపల్లి యూపీఎస్‌కు ఒకరు, కోడేరు బాలికల పాఠశాల నుంచి వడ్డేవాడ పీఎస్‌కు ఒకరు, కోడేరు గుట్ట పాఠశాలకు మరొకరిని కేటాయించారు.

● కల్వకుర్తి మండలంలోని 54 పాఠశాలల్లో 3,746 మంది విద్యార్థులున్నారు. పట్టణంలోని సత్యసాయినగర్ కాలనీ, సిల్లార్‌పల్లి, తర్నికల్‌తండా పాఠశాలల్లో ముగ్గురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు కేటాయించారు. సత్యసాయినగర్ కాలనీ పాఠశాలలో 9 మంది విద్యార్థులు ఉండటంతో ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

● బల్మూరు మండలంలో 143 మంది ఉపాధ్యాయులుండగా 8 మందిని సర్దుబాటు చేశారు. కొండనాగుల జడ్పీహెచ్ఎస్ నుంచి అనంతవరం యూపీఎస్‌కు హిందీ ఉపాధ్యాయుడిని కేటాయించినా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో అధికంగా విద్యార్థులు ఉన్నారని పంపలేదు.

● అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు, సాయినగర్ కాలనీ జడ్పీహెచ్ఎస్ నుంచి ఒకరు, ఐనోల్ జడ్పీహెచ్ఎస్ నుంచి ఒకరు వంతున ఎస్ఏలను బొమ్మన్‌పల్లి పాఠశాలకు కేటాయించినా వెళ్లేందుకు సుముఖంగా లేరు. దీంతో సర్దుబాటు ప్రక్రియ సత్ఫలితాలనివ్వడం లేదు. డొక్కుతండా, దుబ్బతండా, లింగనోనిపల్లి, మర్లపాడుతండా, పెద్దతండా పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపారు.

అనుమతులు లేకుండా విద్యా వ్యాపారం

- కొరవడిన కనీస వసతులు
- పూర్వ ప్రాథమిక తరగతులపై పర్యవేక్షణ కరవు

అచ్చంపేట, కొల్లాపూర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇష్టారీతిగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ డివిజన్ కేంద్రాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పాఠశాలలు వెలుస్తున్నాయి. జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలలు 139 ఉండగా పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో తక్కువ సంఖ్యలో అనుమతులు తీసుకుంటున్నారు. సుమారు 45కు పైగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయని చెబుతున్నారు.

నిబంధనలు పట్టించుకోకుండా... విశాలమైన తరగతి గదులు లేకపోవడంతో ఇరుకు గదుల్లో కొనసాగుతున్న పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. బహుళ అంతస్తుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్లే స్కూల్స్ పేరుతో ఇష్టారీతిగా ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్లే స్కూల్స్ ప్రీస్కూల్స్ పేరుతో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఈ తరగతులు నిర్వహిస్తున్నా వాటికి అనుమతులు తీసుకోవడం లేదు.

ఈ సౌకర్యాలు తప్పనిసరి.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విశాలమైన తరగతి గదులు ఉండాలి. గాలి, వెలుతురు అందేలా శ్రద్ధ తీసుకోవాలి. ఆట స్థలం విధిగా ఏర్పాటు చేయాలన్న నిబంధనలు గాలికొదిలేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి గుర్తింపు తీసుకొని పాఠశాలలు నిర్వహించాలి. చిన్నారులకు అవసరమైన శౌచాలయాలు ఏర్పాటు చేయాలి. సీసీటీవీ కెమెరాలు అన్ని తరగతి గదుల ప్రవేశ ద్వారాల్లో ఉండాలి. ప్రథమ చికిత్స కిట్‌ను ఉంచాలి. తాగునీటి వసతి ఏర్పాటు చేయాలి. ప్రైవేటు పాఠశాల యూడైస్‌లో నమోదై ఉండాలి. పెద్ద తరగతుల వివరాలను నమోదు చేస్తున్నా పూర్వ ప్రాథమిక తరగతుల వివరాలు అందులో నమోదు చేయడం లేదు. బహుళ అంతస్తుల్లో తరగతులు ఉంటే తగిన భద్రతతో లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక శాఖ నుంచి విధిగా అనుమతి పొంది ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు జరిగేలా చూసుకోవాలి.

చెల్లించాల్సినవి ఇలా..:.. ప్రైవేటు పూర్వ ప్రాథమిక పాఠశాలలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారుల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతి కోసం రూ. 25 వేల ఎన్‌రోల్‌మెంట్ నిధి, రూ. 10 వేలు చలానా రూపంలో చెల్లించాలి. శానిటరీ విభాగం, ట్రాఫిక్ పోలీస్, ఇంజినీరింగ్ అధికారి నుంచి భవనం భద్రతపై ఎన్‌వోసీలు తీసుకోవాలి. అద్దె భవనం అయితే యజమాని నుంచి అద్దె ఒప్పంద పత్రాలు తీసుకోవాలి. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే సులువుగా బయట పడేలా తగిన ఏర్పాట్లు ఉండాలి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



అలరించిన లేజర్ షో

ఆధ్యాత్మికత వైపు యువత దృష్టి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అలంపూర్, న్యూస్‌టుడే: యువత ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించారని, ఎక్కడ చూసినా ఆలయాల్లో యువత సందడే కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అలంపూర్ ఆలయాల వద్ద రూ.4.60 కోట్లతో చేపట్టిన మల్టీ మీడియా, సౌండ్ లైట్స్ షోను ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ఇప్పటికే చాలా నిర్లక్ష్యం జరిగిందని, రాబోయే రోజుల్లో అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఆలయాల దర్శనానికి వస్తే క్రమశిక్షణ, పెద్దలను గౌరవించే విధానం తెలుస్తుందన్నారు. ఎంపీలు అరుణ, మల్లు రవి మాట్లాడుతూ.. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రోడ్ల కోసం రూ.300 కోట్ల మేర డీపీఆర్ పంపించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ ప్రాంతానికి రైల్వే లేకపోవడంతో చాలా వెనకబడిందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోజూ రాత్రి 7 గంటలకు తిరిగి 7.45 గంటలకు రెండు పర్యాయాలు 25 నిమిషాల చొప్పున లేజర్ షో ఉంటుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ శాఖ స్పెషల్ సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పుర ఛైర్మన్ పిండి జయరాముడు, వైస్ ఛైర్మన్ విక్రమ్, అలంపూర్ మార్కెట్ యార్డు ఛైర్మన్ దొడ్డప్ప పాల్గొన్నారు.


మత్తు పదార్థాలు అంతం చేద్దాం



రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, పుర ఛైర్‌పర్సన్ రత్నమాల

కల్వకుర్తి, న్యూస్‌టుడే: యువత చెడుమార్గం పట్టడానికి మత్తుపదార్థాలు కారణమని, వాటిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌ను అంతమొందించడానికి, యువతలో చైతన్యం తెచ్చేందుకు 2కె రన్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి, పుర ఛైర్‌పర్సన్ రత్నమాల జెండాను ఊపి పరుగును ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. క్రీడలతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు. పుర మాజీ ఛైర్మన్ సత్యం, పట్టణ మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రన్ నిర్వాహకులు స్వాములు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, ప్రకాశ్, జ్యోతి, లాలమ్మ, మల్లేశ్, నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

నిండా మొక్కలు.. నీరు రాక చిక్కులు



సాగునీటిని అందించే ఆర్డీఎస్ ఉప కాల్వలు అధ్వానంగా మారడంతో ఆశించిన నీరందని పరిస్థితి నెలకొంది. మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, పచ్చర్ల, తుమ్మిళ్ల, ఆశోకెనగర్, రాజోలి గ్రామాల్లో ఆర్డీఎస్ కాల్వ ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కింద వివిధ రకాల ఉప కాల్వలున్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి సాగునీటిపారుదలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే నీరు లేక పంటలకు గడ్డుకాలం ఉండగా, రానున్న రోజుల్లో నీరొచ్చినా గడ్డి, పిచ్చిమొక్కల కారణంగా పంటకు సరిపడా నీరందక పోతుందని రైతులు వాపోతున్నారు. -న్యూస్‌టుడే, రాజోలి

అసంపూర్తి పనులతో అవస్థలు



పుర పరిధిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టడానికి దాదాపు ఆరు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించారు. సంబంధిత గుత్తేదారుడు స్లాబ్ వేసి గోడల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఒకే గది ఉండటంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కందనూలు

పట్టుబట్టు.. గోల్ కొట్టు



సెలవొస్తే చాలు జడ్చర్ల మినీ స్టేడియం కిటకిటలాడుతుంటుంది. వయసుతో సంబంధం లేకుండా వివిధ రకాల క్రీడలు సాధన చేస్తుంటారు. ఆదివారం పిల్లల నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఫుట్‌బాల్ ఆడటం ఆకట్టుకుంది. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం సాధన చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నామని వారు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం

దంత వైద్యం.. సేవలకు దూరం



మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడేళ్ల కిందట రూ.5 లక్షలు వెచ్చించి దంత చికిత్స యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రెండేళ్లు వైద్య సేవలు అందించారు. గతంలో పని చేసిన దంత వైద్యుడు బదిలీపై వెళ్లడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెడితే.. వైద్యసేవలు మళ్లీ ప్రారంభం అవుతాయనడంలో సందేహం లేదు. - న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం

ఆర్టీసీ వైపే మహిళల చూపు



నాగర్‌కర్నూల్: ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న మహిళలు

కందనూలు, కల్వకుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లడానికి ఆసుపైన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయాణ ప్రాంగణానికి బస్సు వచ్చిన వెంటనే, ముందు నిమిషాల్లోనే సీట్లు పూర్తిగా నిండిపోతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం మహిళా ప్రయాణికులే ఉంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం కాకముందు ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో మొత్తం ప్రయాణికుల సంఖ్య సగటున రోజుకు 1.55 లక్షలు ఉండగా.. పథకం అమలయ్యాక 2.90 లక్షలకు పైగా చేరిందని, అందులో 1.70 లక్షలకు పైగా మహిళలే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత 2023 ఏడాది డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు దాదాపుగా 894 రోజులను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పరిధిలో 2172.27 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు ప్రకటించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రూ.752.06 కోట్ల ఆదాయం

ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీ డిపోలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2023 సంవత్సరం డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు ఛార్జీల రూపంలో రూ. 752.06 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 650.21 లక్షల మంది మహిళలు ప్రయాణించడంతో రూ.225.53 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ డిపోల పరిధిలో 631.09 లక్షల మంది ప్రయాణించడంతో రూ.218.20 కోట్లు వచ్చాయి. నారాయణపేట జిల్లా పరిధిలో 301.16 లక్షల మందికి రూ.104.39 కోట్లు, జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 280.84 లక్షల మందికి రూ.96.97 కోట్లు, వనపర్తి జిల్లా పరిధిలో 308.97 లక్షల మంది మహిళల వల్ల రూ. 106.98 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రీజియన్ పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. తర్వాత స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది.



అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వరాలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, సర్వ దర్శనం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి ఆలయంలో రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి, జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

నాట్య మయూరాలు

కూచిపూడిలో రాణిస్తూ.. శిక్షణనిస్తున్న మహిళలు



వెయ్యి మందికి శిక్షణ

జడ్చర్ల పట్టణం, వనపర్తి, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఈ రంగంలో భవిష్యత్తులో రాణించేందుకు శిక్షణ తీసుకుని పట్టు సాధించారు. పలు వేదికలపై ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. అంతటితో ఆగిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నాట్యకారిణులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

మాది వనపర్తి పట్టణం. జడ్చర్లలో ఉంటున్నా. గురువు వద్ద శిక్షణ తీసుకున్నా. కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా, తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ కూచిపూడి కోర్సు పూర్తి చేశా. 80కి పైగా ప్రదర్శనలిచ్చి బహుమతులు పొందా. 'సాయికృప కూచిపూడి కళాక్షేత్రం' ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా. వెయ్యి మంది చిన్నారులను తీర్చిదిద్దాను. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చి ప్రతిభ కనబరుస్తున్నారు. నృత్యంతో పాటు శ్లోకాలు, ముద్రలు, తాళాలు, పాటలు నేర్పిస్తున్నా. నాకు నాట్య మయూరి, నాట్యశ్రీ, నృత్య ప్రతిభ కళారత్న, నాట్యహంస, నాట్య మంజీరా పురస్కారాలు దక్కాయి. సర్కారు పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. - పడాల బిందుమాధవి



25 ప్రదర్శనలిచ్చా..

జడ్చర్ల వెంకటేశ్వరకాలనీ మాది. అమ్మానాన్న ఆరేళ్ల ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తున్నా. దేవస్థానాలు, వివిధ వేదికల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించా. 25 నృత్య ప్రదర్శనలిచ్చా. అమెరికా, దుబాయ్, ఆస్ట్రేలియాలో చిన్నారులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నా. ఏడాది కిందట 'కృష్ణ తరంగిణి నృత్యాలయం' ఏర్పాటు చేశా. వంద మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నా. వీరు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించా. మయూరి నర్తకి, నంది పురస్కారాలు అందుకున్నా. కూచిపూడి నృత్యంలో మరింత రాణించడమే నా లక్ష్యం. - చిగుళ్లపల్లి సంధ్య

తరగతి గది.. విజ్ఞాన నిధి

వినూత్నంగా బోధిస్తున్న ఉపాధ్యాయినులు





పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయినులు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య దేశ భవితను నిర్మిస్తున్నారు. నల్లపలక వంటి మెదడులో విజ్ఞానమనే అక్షరాలు దిద్ది, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల జీవితాల్లో విజ్ఞాన కాంతులు వెదజల్లుతున్నారు. బోధనోపకరణాలతో వినూత్నంగా బోధిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

ఆకర్షించేలా.. అన్వేషించేలా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని **వి.స్వప్న** సులువైన మార్గాలతో విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్నారు. పాఠ్యాంశాలను ఆకర్షించేలా, అన్వేషించేలా, వివరించేలా, విస్తరించేలా, మదింపు చేసేలా.. ఇలా పది సార్వత్రిక టీఎల్ఎం బోధనా పద్ధతులను బోధనకు వినియోగిస్తున్నారు. ఆటల ద్వారా, గ్రూప్ యాక్టివిటీ, ప్రశ్నల పెట్టె, రియల్ లైఫ్ లింక్, మల్టీ సెన్సార్, లో కాస్ట్-నో కాస్ట్, డిజిటల్ విధానాల్లో బోధిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకుంటున్నారు.



భయం పోగొట్టి..: బాలానగర్ మండలం పెద్దరేవల్లి ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయిని **పాలాది శ్రీవాణి** తనదైన శైలిలో బోధిస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఆంగ్లంలో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టి. టీఎల్ఎంతో కథలను అనుసంధానించి బోధిస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా బ్రిడ్జింగ్ గ్యాప్ యాక్టివిటీతో విద్యార్థుల్లో లెర్నింగ్ గ్యాప్‌ను తగ్గిస్తున్నారు. బోధనలో ఆమె చొరవ రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా నిలబెట్టాయి. పూర్వ ప్రాథమిక విద్య కరికులం డెవలపర్‌గా తన వంతు పాత్ర పోషిస్తున్నారు.



దృశ్య ప్రధానంగా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) **సి.అరుణమ్మ** విద్యార్థులకు సహజ పద్ధతిలో బోధిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలు బోధించడం కంటే దృశ్య ప్రధానంగా చేసి చూపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠాలకు అనుగుణంగా టీఎల్ఎంలను తయారు చేసి విద్యార్థులకు చూపుతూ బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు సైతం అర్థం చేసుకుంటున్నారు. తడబాటు లేకుండా పరీక్షల్లో సమాధానాలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు.

విద్యార్థులే గురువులు.. నాయకులు: కోయిలకొండ మండలం పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ **ఎ.వంశీలత** చిన్నారులకు ఆంగ్లంలో వినూత్నంగా బోధిస్తున్నారు. పనిచేస్తూ నేర్చుకోవడం అనే పద్ధతి ఆధారంగా లిటిల్ టీచర్-లిటిల్ లీడర్ అనే భావనతో విద్యార్థులే చిన్న ఉపాధ్యాయులుగా, చిన్న నాయకులుగా మారి సహచరులకు పాఠ్యాంశాలను వివరించేలా ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రతి విద్యార్థిని అభ్యసన ప్రక్రియలో చురుకైన భాగస్వామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

దాతలు నిర్మించినా.. నిరుపయోగమే



తాళం వేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవి ఉన్నా వినియోగించని దుస్థితి. ఈ బడి పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. కానీ వసతులు మాత్రం మెరుగుపడలేదు. 240 మంది విద్యార్థులు చదువుతున్నా కనీస సౌకర్యాలు లేవు. దీంతో గతేడాది ఓ స్వచ్ఛంద సంస్థ రూ.లక్షలు ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు కుళాయి, తాగునీటి ట్యాంకులు నిర్మించింది. నెలలు అవుతున్నా వాటిని ప్రారంభించడం లేదు. తాళం వేసి ఉంచడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

79 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో ఆదివారం రెండు టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన ఒకటి, దిగువన ఒక టర్బయిన్‌లో 79 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 5075 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అనుమానంతో మహిళ దారుణ హత్య

కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజాపూర్ ఠాణాలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గఢ్ జిల్లా కచికేడికి చెందిన చోటేఖాన్ లారీ డ్రైవర్. మూడేళ్ల కిందట లారీ నడుపుతుండగా.. షాద్‌నగర్‌లో మహిళ పరిచయమైంది. ఆమె రెండేళ్ల కిందట లాలీ(35) అనే మహిళను చోటేఖాన్‌కు పరిచయం చేసింది. వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లితండాకు చెందిన లాలీకి భర్త, ఇద్దరు పిల్లలున్నా బాలానగర్‌లోని అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

పరిచయం ప్రేమగా మారి..: చోటేఖాన్, లాలీ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. లాలీ బాలానగర్‌లో లారీ ఎక్కి చోటేఖాన్‌తో కలిసి బెంగళూరు, నాగ్‌పూర్, తమిళనాడుకు వెళ్లేవారు. అయితే ఆమె వేరే వ్యక్తులతో శారీరక సంబంధం పెట్టుకుందనే అనుమానంతో చోటేఖాన్ పలుమార్లు మందలించాడు. అతడి భార్య కూడా చనిపోవడంతో లాలీని పెళ్లి చేసుకొని, స్వగ్రామంలో ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ విషయం ఆమెకు చెప్పినా చూద్దాంలే అని బదులిచ్చేవారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి.

అంతమొందించాడిలా...: చోటేఖాన్ లారీతో ఈ నెల 15న కేరళ నుంచి హరియాణాకు బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆరు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. 18న బాలానగర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణం దగ్గర లారీ ఆపి, లాలీకి ఫోన్ చేశాడు. హరియాణకు వెళ్తున్నానని, రావాలని కోరగా.. మరో లారీ వద్ద ఉన్నానని, ఐదు నిమిషాలు ఆగాలని ఆమె సమాధానమిచ్చారు. అనుమానం వచ్చి ఆమె ఉన్న చోటకు వెళ్లగా.. వేరే వ్యక్తులతో కనిపించారు. దీంతో ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెను లారీలో ఎక్కించుకున్నాడు. ఎందుకు మోసం చేశావని గొడవ పెట్టుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న చోటేఖాన్ క్షణికావేశంలో కూరగాయల కత్తితో ఆమె గొంతుపై పొడిచాడు. చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో రహదారి పక్కన పడేశాడు. అనంతరం లారీతో బెంగళూరు వైపు పారిపోయాడు. 19న స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అద్దె గదిలో సిమ్‌కార్డు, కాల్ రికార్డు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును 10 రోజుల్లోనే ఛేదించిన జడ్చర్ల గ్రామీణ సీఐ మహేశ్, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

సుమతి ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: సీపీఐ నాయకురాలు సుమతి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సుమతి సంతాప సభలో ఆమె ప్రసంగించారు. సుమతి విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో పనిచేసి, కులాంతర వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. సుమతి భర్త రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, కుమార్తె డా.ప్రతిభ, అల్లుడు డా.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, బాబురావు, వెంకటేశ్వరరావు, సాగర్, జంగారెడ్డి, మురళీకృష్ణ, వెంకట్రాములు, భూపాల్, శివప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య ప్రసాదరావు, శివప్రసాద్, రాంరెడ్డి, గోపాల్, కురుమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

354 మంది అభ్యర్థుల హాజరు



ఫాతిమా విద్యాలయం కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన నీట్ పీజీ అర్హత పరీక్ష -2026 ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయం, ధర్మాపూర్ వద్ద ఉన్న జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష సజావుగా సాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పరీక్షకు 360 మంది అభ్యర్థులకు 354 మంది (99 శాతం) హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 180 మందికి 178 మంది, జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మందికి 176 మంది హాజరయ్యారు. ఆరుగురు మాత్రమే గైర్హాజరయ్యారు. పరీక్షలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన జీపీవోల సేవలను ఆరా తీశారు.

పోలీస్ బందోబస్తు: పరీక్ష కేంద్రాలకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కేంద్రాలను ఎస్పీ డి.జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గ్రామీణ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



వీరస్వామి

వీపనగండ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మరణించాడు. ఆదివారం రాత్రి వీపనగండ్ల-వెలగొండ మధ్య జరిగింది. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన పంచాయతీ వర్కరు వీరస్వామి(38) చిన్నంబావి మండలం దగడపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి వెలగొండ సమీపంలో ఓ చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వీరస్వామి గుర్తించి దారిన వెళ్లే వారు 108కు సమాచారమిచ్చారు. క్షతగాత్రుని వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈయనకు భార్య జ్యోత్స్న, కుమార్తె ఉన్నారు.

సాంకేతికత తోడుగా.. భద్రత మెండుగా

ఏటీఆర్ సంరక్షణకు డ్రోన్ల వినియోగం



అడవిలో చెట్లకు కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

అమ్రాబాద్, న్యూస్‌టుడే: అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం(ఏటీఆర్) పరిరక్షణ ఆధునిక సాంకేతికత వినియోగంతో మరింత పటిష్ఠంగా మారింది. వన్యప్రాణులు, అరుదైన వృక్ష జాతులు, విలువైన కలపకు నిలయమైన నల్లమల పరిరక్షణకు వాచర్లు, ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్ఆర్వోలు నడుం బిగించారు. ప్రతి ప్రాంతాన్ని సిబ్బంది నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించడం సాధ్యం కాకపోవటంతో కీలకమైన సాంకేతికతను ఆసరాగా చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి అక్రమాలకు పాల్పడుతున్న వేటగాళ్లు, స్మగ్లర్లు, ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు కెమెరాలు, డ్రోన్లు, ఈ-సర్వైలెన్స్ కెమెరాలు వినియోగిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

వన్యప్రాణులు, వేటగాళ్ల కదలికలపై నిఘా: అడవి 2,611 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. అడవిలో జంతువులు తరచూ సంచరించే ప్రదేశాలు, మార్గాలు, నీటి వనరుల వద్ద, పులులు వన్యప్రాణులను చంపిన ప్రదేశాల్లో సిబ్బంది కెమెరాలను చెట్లపై నేలకు అడుగున్నర ఎత్తులో బిగిస్తారు. పులులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులు కెమెరాల ఎదుట నుంచి వెళ్లినపుడు వాటి కదలికలను పసిగట్టి చిత్రాలను రికార్డు చేస్తాయి. దీంతో అడవిలోని వన్యప్రాణుల సంచారంపై సమాచారం తెలుస్తుంది. అడవిలోకి అక్రమంగా ప్రవేశించే వేటగాళ్లు, స్మగ్లర్లు, అటవీ ఆక్రమణదారుల చిత్రాలు కెమెరాల్లో రికార్డవుతాయి. గతంలో మద్దిమడుగు రేంజ్, అచ్చంపేట రేంజ్‌లలో వేటగాళ్లు జంతువులను వేటాడి మాంసాన్ని తీసుకెళ్తూ కెమెరాలకు చిక్కారు. వీటి ఆధారంగా నిందితులను గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. కెమెరాలో నిక్షిప్తమైన చిత్రాలను డేటాబేస్‌లో నిల్వ చేస్తారు.

డ్రోన్లతో పరిశీలన

ఏటీఆర్‌లో మనుషులు చేరుకోలేని లోయలు, ఎత్తైన కొండ ప్రాంతాలను పరిశీలించేందుకు రెండు అధునాతన డ్రోన్లను వినియోగిస్తున్నారు. అటవీ ఆక్రమణలు, కలప నరికివేత, మానవ సంచారం, అగ్నిప్రమాదాల సమాచారాన్ని తెలుసుకునేందుకు డ్రోన్లు సహాయపడుతున్నాయి. వీటితో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణాన్ని పరిశీలించే అవకాశం ఉంటుంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాల్లో మంటల వ్యాప్తి నిరోధానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక డ్రోన్లు 10 కి.మీ. విస్తీర్ణంలోనూ చిత్రాలను చిత్రీకరిస్తాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ 10 గం. నుంచి మ 1 వరకు
నాగర్‌కర్నూల్: 7993300530
అచ్చంపేట: 8008573927
కల్వకుర్తి: 8008573884
కొల్లాపూర్: 8008573870

కొల్లాపూర్, న్యూస్‌టుడే: ?: కొల్లాపూర్ పట్టణంలోని బస్టాండ్ లోపలికి, బయటికి వెళ్లే మార్గాల్లో రోడ్డుపై గుంతలు పడ్డాయి. వర్షపు, మురుగునీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చాలి. **- సాయికుమార్, కొల్లాపూర్ పట్టణం** ✔: గుంతల పూడ్చివేతకు చర్యలు చేపడతాం. **- విజయ్, ఏఈ, కొల్లాపూర్** ?: 167వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ సమీపంలోని సింగోటం చౌరస్తా వద్ద సర్వీస్ రహదారు నిర్మాణం పూర్తి కాలేదు. కంకర పరిచి వదిలేశారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ రాకపోకల్లో ఇబ్బందులు కలుగుతున్నాయి. పనులు పూర్తి చేయాలి. **- గోపాల్, కొల్లాపూర్.** ✔: సర్వీస్ రహదారుల పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. **- రమేశ్, డీఈ, జాతీయ రహదారుల శాఖ** **కందనూలు:** ?: పట్టణంలోని స్నేహపురి కాలనీలో ప్రైవేట్ పాఠశాల సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద రక్షణ కంచె లేదు. **- మధు, నాగర్‌కర్నూల్.** ✔: రక్షణ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ?: పట్టణంలోని నాగనూల్ చెరువు సమీపంలో ఏర్పడుతున్న నివాసాల మధ్య విద్యుత్తు సౌకర్యం కల్పించడానికి స్తంభాలు వేసి తీగలు బిగించలేదు. **- రాజశేఖర్, నాగర్‌కర్నూల్.** ✔: తీగలు బిగించడానికి చర్యలు తీసుకుంటాం. **(ఏఈ మాన్యనాయక్ సమాధానం ఇచ్చారు.) తాడూరు:** ?: 11వ వార్డులో తాగునీటి సమస్య నెలకొంది. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. **- బుచ్చన్న, తాడూరు.** ✔: సమస్యను పరిష్కరిస్తాం. **- రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి, తాడూరు**

తెరపై ఈనాడు

కందనూలు, న్యూస్‌టుడే : అచ్చంపేటలో... సాయిరాం : టాక్సిక్, సత్యలక్ష్మి : ఇరుముడి. **కల్వకుర్తిలో..** అశోక : టాక్సిక్, పార్థసారథి : ఇరుముడి. **నాగర్‌కర్నూల్‌లో...** రవి : టాక్సిక్


బుద్దసముద్రంలో..

ఘనంగా బోనాలు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని బుద్దసముద్రంలో ఉత్సాహంగా బోనాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించిన మహిళలు బంగారు మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల వేషాలు ఆకట్టుకున్నాయి. రాత్రి పొద్దుపోయేవరకు ఊరేగింపు జరిపారు.


కాంసానిపల్లిలో పాల్గొన్న మహిళలు

ఉప్పునుంతల, న్యూస్‌టుడే: ఉప్పునుంతల, కాంసానిపల్లి గ్రామాల్లో ఆదివారం యాదవులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా పెద్దమ్మ తల్లి ఆలయం వద్దకు వెళ్లి బోనాలను సమర్పించారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలు తిప్పి కొట్టాలి: సీపీఐ

కందనూలు, న్యూస్‌టుడే: కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్


దిల్లీకి వెళ్తున్న నాయకులు

ఎండీ ఫయాజ్ పేర్కొన్నారు. ఆ పార్టీ జాతీయ నాయకులు సెప్టెంబరు 1న చల్లో దిల్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం జిల్లా నుంచి కార్యకర్తలు దిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తర్వాత కులం, మతం పేరిట రాజకీయాలు చేస్తూ దేశ సంపదను ఇతరులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. లక్ష్మీపతి, శ్రీనివాసులు, శివుడు, రవీందర్ పాల్గొన్నారు.

సీపీఐ కార్యకర్తల పయనం

తెలకపల్లి, న్యూస్‌టుడే: సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న దిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన మహాధర్నాకు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిరసనగా తలపెట్టిన పార్టీ మహాధర్నాకు 35 మంది పార్టీ కార్యకర్తలు హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్నట్లు మండల కార్యదర్శి వి.రవీందర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తాడూరు, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాములు కథనం మేరకు...తెలకపల్లి మండల శివారులోని దుందుభి వాగు నుంచి ఆదివారం తాడూరు మండలంలోని చర్లఇటిక్యాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, యజమాని సతీశ్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పట్టా పొలంలో మట్టి తరలింపుపై ఫిర్యాదు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: పంటలు సాగు చేసుకునే పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు మట్టి తరలించారని ఆవంచకు చెందిన నాగమ్మ తిమ్మాజిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలంలో రెండు రోజులుగా పొక్లెయిన్లతో మట్టిని తవ్వి.. పెద్దపెద్ద గుంతలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రివేళ మట్టి తరలిస్తున్నారని, అడ్డుకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు.

నీరు లేకుంట వెలవెల



లింగాల శివారులో పెద్దకరణం కుంట ఇది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక మండలంలో చెరువులు, కుంటలు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. మండలవ్యాప్తంగా చెరువులు, కుంటలు 58 ఉన్నాయి. 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. నీరు లేక ఎక్కడా వరినాట్లు వేయలేదు. బోర్ల కింద సుమారు 150 ఎకరాల్లో నాట్లు వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే, లింగాల**

సూక్ష్మ రుణం.. ఇక్కట్లమయం

- ప్రతి నెలా చెల్లించకపోతే ఇంటి వద్దకే ఏజెంట్లు
- పరువు కోసం కొత్త అప్పులు చేస్తున్న పరిస్థితి

కొల్లాపూర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: అవకాశాన్ని ఆసరాగా చేసుకొని కొన్ని ప్రైవేట్ కంపెనీలు మహిళా సంఘాలకు, యువకులకు సూక్ష్మ రుణాలు ఇచ్చి నెలనెలా చెల్లించకపోతే బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. నెలకు ముందే ఖాతాల్లో, లేదా నేరుగా జమచేయకపోతే కట్టాల్సిందేనని ఇబ్బంది పెడుతూ వసూళ్లు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొందరు కంపెనీ ఏజెంట్లు ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి సూక్ష్మరుణాలు ఇచ్చిన మహిళా సంఘాల వద్దకు వెళ్లి ఇళ్ల వద్ద నిరీక్షిస్తుండటంతో పరువుపోతుందని కొందరు కొత్త అప్పులు చేసి చెల్లించాల్సిన దుస్థితి నెలకొంటోంది. జిల్లాలో పరిస్థితి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది.

లబ్ధిదారులకు వల వేస్తూ..: గ్రామీణ ప్రాంతాల్లోని కొందరు మహిళా సంఘాల వద్దకు ప్రైవేట్ కంపెనీల ఏజెంట్లు వెళ్లి వ్యక్తిగత, ఇంటి రుణాలు ఇస్తామని చెబుతారు. మా బ్యాంకు, కంపెనీ తక్కువ వడ్డీకే ఇస్తుందని తొలుత అందర్నీ బుట్టలో వేస్తారు. అమాయకులు వారి వలలో పడ్డాక పూర్తి వివరాలతో పాటు వారికి కావాల్సిన పత్రాలు తీసుకుంటున్నారు. వారంలో రుణం మంజూరు చేస్తామని తొలుత రూ.50 వేల నుంచి ఇస్తున్నారు. ప్రతి నెలా రూ. 12 వందల నుంచి రూ. 2,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది, 24 నెలలు నుంచి 54 నెలలుగా కేటాయించుకోవాలని చెబుతూ ఆశపెడతారు. వారంలో వారి ఖాతాల్లో ముందుగానే రూ.5 వేల అప్పుగా ఇస్తున్నారు. రెండు నెలల అనంతరం ప్రతి నెలా వారం రోజుల ముందుగానే వారి ఖాతాల్లో డబ్బులు పడేలా చూసుకోవాలి. లేదంటే ఒక్కరోజు ఆలస్యమైతే ఇంటికి కంపెనీ ఏజెంట్ వచ్చి కూర్చుంటున్నారు. ఒకరోజు ఆలస్యం అయినందుకు రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. తక్కువ రుణాలైతే ఇంటి వద్దకు పలుమార్లు తిరిగి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. వారం రోజులు డబ్బులు కట్టకుంటే వడ్డీతో పాటు చక్రవడ్డీ వసూలు చేస్తున్నారు. ఇంటి రుణాలైతే ఏకంగా ఇంటికి తాళాలు వేస్తామని బెదిరించడంతో పరువు పోతుందని వారు చెప్పిన విధంగా కొత్తగా అప్పులు చేసి డబ్బులు కడుతున్నారు. కొల్లాపూర్ నియోజక వర్గంలోని కొల్లాపూర్, కోడేరు, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి, బల్మూరు, తదితర మండలాల్లో ఇలాంటి పరిస్థితి ఎక్కువైంది. జిల్లాలో సూక్ష్మ రుణాల బలవంతపు వసూళ్లపై ఎక్కడా ఫిర్యాదులు అందలేదని పోలీసులు, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా అధిక వడ్డీలు, బలవంతపు వసూళ్లు చేసే సంబంధిత అధికారులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ

జిల్లాలోని సూక్ష్మ రుణాలు దాదాపుగా 1,850 సంఘాల్లోని సభ్యులు తీసుకున్నారు. రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకున్న మహిళా సంఘాల సభ్యులే ఎక్కువ ఉన్నారు. కూలిపనులు చేసేవారు, ప్రైవేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలు పొందే యువకులు ప్రైవేటు అప్పులు తీసుకుంటున్నారు. ఇంకా లెక్కలోకి రానివారు ఎంతో మంది ఉన్నట్లు మహిళా సంఘాల విధులు నిర్వహించే సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం సెర్ప్ నుంచి ఇస్తున్న రుణాలు కాకుండా అనుమతి లేని ప్రైవేట్ కంపెనీల వారు ఇస్తున్నవి అవసరాల నిమిత్తం తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత


గువ్వలోనిపల్లి: పూజల్లో పాల్గొన్న డా.వంశీకృష్ణ

ఉప్పునుంతల, న్యూస్‌టుడే: ప్రజలు దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ సూచించారు. మండలంలోని గువ్వలోనిపల్లిలో రుద్రాంశ సహిత రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజస్తంభం, గణపతి, సీతా రామచంద్రస్వామి, ఉమామహేశ్వరస్వామి, హన్‌మాన్ విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవునిపై మనసును లగ్నం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సర్పంచి పానుగంటి శ్రీదేవి దంపతులు, కట్టా అనంతరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

అచ్చంపేట, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. లింగాల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరశర్మ ఉద్యోగ విరమణ సందర్భంగా అచ్చంపేటలో నిర్వహించిన సన్మాన సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. మాజీ ఎంపీ రాములు, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ రాజేందర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్, పుర మాజీ ఛైర్మన్లు శ్రీనివాసులు, నర్సింహగౌడ్, లింగాల జీహెచ్‌ఎం బషీర్‌అహ్మద్, ఎంఈవోలు, జీహెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: మండలంలోని ఐనోలులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కోరారు. ఆదివారం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. గిరిజన బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించి మెనూ అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. మల్లేశ్, బుచ్చిరాములు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ దేవత బోనాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని అంకాలమ్మ దేవత బోనాల ఉత్సవాలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎవరికీ నష్టం జరగకుండా చూడాలి: ఎమ్మెల్యే

కల్వకుర్తి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి వెంట ఉన్న షాపులను తొలగించే సమయంలో ఎవరికీ నష్టం జరగకుండా చర్యలు


బాధితులతో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

చేపట్టాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని 167 జాతీయ రహదారి వెంట తొలగించిన షాపులు, చిరు వ్యాపారుల స్థావరాలను పరిశీలించారు. జాతీయ రహదారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. బాధితులతో మాట్లాడారు. వాహనాల రాకపోకలకు, పాదచారులకు సహకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పుర ఛైర్‌పర్సన్ రత్నమాల, పట్టణ మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, రాహుల్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కోడేరు, న్యూస్‌టుడే: మండలంలోని బావాయిపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఇన్‌ఛార్జి భగవంతు తెలిపారు. అధ్యక్షుడిగా దేవరపాగ నాగరాజు, ఉపాధ్యక్షులుగా గుమ్మకొండ రాజు, డి.కేశవులు, ప్రధాన కార్యదర్శిగా ఉమేశ్, అధికార ప్రతినిధిగా రాంబాబు, కార్యదర్శులుగా కేశవులు, నరేశ్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఎందుకు మౌనం..?


ప్రసంగిస్తున్న భాజపా నాయకులు

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ప్రజలకు అందిస్తున్న కేంద్ర పథకాలపై నోరు విప్పకుండా ఎందుకు మౌనం పాటిస్తున్నారని అధికార పార్టీ ప్రజాప్రతినిధులను భాజపా నాయకులు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని పాలమూరు కూడలిలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పుర పరిధి నుంచి వెళ్తున్న 167 రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, చిరువ్యాపారుల స్థావరాలను, కేంద్రం, నేషనల్ హైవే అథారిటీ మార్గదర్శకాల ప్రకారమే తొలగింపునకు చర్యలు చేపట్టారని ఛైర్‌పర్సన్ రత్నమాల, కౌన్సిలర్లు చెప్పడంపై భాజపా నాయకులు స్పందించారు. పుర అభివృద్ధికి కేంద్రం ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండు చేశారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కౌన్సిలర్ బోడ నరసింహ, కౌన్సిలర్లు రామకృష్ణ, శ్రీరాములు, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గాప్రసాద్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి


పోలీసు సిబ్బందితో డీఎస్పీ శ్రీనివాసులు

పెంట్లవెల్లి, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణపై దృష్టి కేంద్రీకరించాలని పోలీసులకు డీఎస్పీ బి.శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసులు, విచారణలో పురోగతి, స్టేషన్ పరిసరాలు, ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు తదితర అంశాలపై ఆరా తీశారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎస్సై పవన్‌కుమార్‌కు సూచించారు. శాంతిభద్రతలకు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించొద్దన్నారు. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది మోహన్, మహేశ్, రాజన్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు మహాధర్నా

అచ్చంపేట, న్యూస్‌టుడే: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఇందిరాపార్కులో ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందని చెప్పారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ధర్నాకు సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.


ఆవంచ పాఠశాలలో పూర్వవిద్యార్థులు

గురువులకు సత్కారం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ఆవంచ జడ్పీ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల ఆవరణకు చేరుకున్న వారంతా ఆటపాటలతో గడిపారు. గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, అన్సర్, శంకర్, రాఘవేందర్, శివ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కార్యవర్గ నియామకం

కందనూలు, న్యూస్‌టుడే: మున్నూరుకాపు రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా స్వర్ణలత, ఉపాధ్యక్షులుగా భాస్కర్, శంకరయ్య, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా బాలరాజు, కోశాధికారిగా నరేందర్‌లను నియమించారు. రాఘవులు, వారధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాపత్య పోటీల్లో ప్రతిభ


విజేతగా నిలిచిన బాలికల జట్టు


తృతీయస్థానంలో నిలిచిన బాలుర జట్టు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. నాగర్‌కర్నూల్ తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమానికి శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయపోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువల పెంపునకు దోహదం

వెల్దండ, న్యూస్‌టుడే: మానవతా విలువల పెంపునకు ధ్యాన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. వెల్దండ మండలం బర్కత్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కొండల్‌యాదవ్, మాజీ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచి నర్సింహ, నిర్వాహకులు పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం.. వేలానికి సిద్ధం

- సెప్టెంబరు 2 వరకు టెండర్ల గడువు
- నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు


వనపర్తి గోదాంలో నిల్వ ఉన్న బస్తాలు

వనపర్తి పట్టణం, అయిజ, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలు, స్టేజి-1, స్టేజి-2 గోదాముల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంతమేర నిల్వలు ఉన్నాయనేది ఉన్నతాధికారులకు పంపించారు. వారు తాజాగా పరిశీలించి వేలం వేసేందుకు చర్యలు చేపట్టారు. మొన్నటి వరకు దొడ్డు బియ్యం ముక్కిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. మొదట్లో దొడ్డు బియ్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనంతరం మరిచారు. గతంలో వీటిని వేలం వేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రెండు సార్లు నిర్ణయం తీసుకొని వెనక్కి తగ్గారు. ఉమ్మడి జిల్లాలో 2,027 రేషన్ దుకాణాలు ఉన్నాయి.

జిల్లా	దుకాణాలు	రేషన్ కార్డులు
గద్వాల	355	1,85,658
మహబూబ్‌నగర్	506	2,72,821
నాగర్‌కర్నూల్	558	2,72,487
నారాయణపేట	301	1,66,838
వనపర్తి	336	1,83,568

కిలో రూ.21.65 ధర..: దొడ్డు బియ్యానికి అధికారులు కిలో రూ.21.65 ధర నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాల వారీగా ఎంతమేర నిల్వలు ఉంటే అంత వరకు టెండర్ దారులు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలి. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 2 వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసుకునే అవకాశం కల్పించారు. టెండర్లలో కనీస ధర కంటే ఎక్కువ నమోదు చేసిన వారికి అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు డీలర్లకు దుకాణాల వారీగా నిల్వల వివరాల జాబితాను పంపనున్నారు. దీని ఆధారంగానే వారు నిల్వలు చూపాలి. లేనిపక్షంలో టెండర్ దాఖలు చేసిన ధర ప్రకారం డీలర్లు డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం అధికారులు గోదాముల్లో నిల్వలను పరిశీలిస్తుండగా డీలర్లు తరుగుపై ఆలోచిస్తున్నారు. 50 కిలోల బస్తా 16 నెలలుగా నిల్వ ఉంచితే కనీసం తరుగు వస్తుందని, దీన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు.

బోధనా రుసుముల చెల్లింపులో జాప్యం

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు బోధనా రుసుములు చెల్లించడంలో జాప్యం చేస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శివచంద్ర ఆదివారం ప్రకటనలో తెలిపారు.

దారి.. గోతులుగా మారి..



మండల కేంద్రంలోని పలు అంతర్గత వీధుల్లోని సీసీ దారులు బురదగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాల కిందట నిర్మించినవి పూర్తిగా పాడయ్యాయి. చిన్నపాటి వర్షానికి బురదగా మారుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రద్దీగా ఉండే చెన్నకేశవుల ఆలయం వరకు ఉన్న ప్రధాన సీసీ రహదారిని బాగుచేయాలని అంతా కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడూరు**

ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించరూ..



సోమశిలలోని శ్రీసోమేశ్వర క్షేత్రం ఆవరణలో చిత్తడిగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో అపరిశుభ్రత నెలకొంది. ఈ క్షేత్ర సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ, ఎండోమెంట్, పురావస్తు శాఖల అధికారులు స్పందించి ఆలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతున్నారు. సమస్యపై సర్పంచి కాటంవెంకటలక్ష్మి స్పందిస్తూ ఆలయ ఆవరణలో వ్యర్థాలు పడేయకుండా పరిశుభ్రత చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, కొల్లాపూర్**

శ్వేతపత్రం విడుదలకు డిమాండు

కందనూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని భారాస నాయకుడు డా. నాగం శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు ప్రకటించి ఇప్పటి వరకు మహాలక్ష్మి పథకం తప్ప...మిగిలినవి ఏవీ అమలు చేయడం లేదని విమర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఎ.రవి, బాలగౌడ్, అర్జునయ్య, భీముడు, సత్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

వంగూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శారద ఆదివారం చెప్పారు. ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగాల, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. జిల్లా కేంద్రానికి వెళ్లకుండా ఇక్కడే సమస్యలపై దరఖాస్తులు అందజేయాలన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కానున్నట్లు వివరించారు.

దివ్యాంగులకు దాతల చేయూత

అచ్చంపేట, న్యూస్‌టుడే: గుంపన్‌పల్లికి చెందిన సబావట్ హన్మంత్‌నాయక్ ఆదివారం పట్టణంలోని దివ్యాంగుల కార్యాలయంలో 12 కుర్చీలను ఆ సంఘానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి రాజశేఖర్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. శంకర్, దేవేందర్, చాంద్‌పాషా, నరేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు గౌరవించాలి


పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలు గౌరవించాలని ఎస్సై సతీశ్ సూచించారు. మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో గత కొన్ని వారాలుగా భాజపా ఆధ్వర్యంలో జంతుబలి జట్కా పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఆదివారం మళ్లీ వివాదాలు తలెత్తడంతో ఎస్సై సతీశ్ సంఘటనా స్థలానికి చేరుకుని భాజపా నాయకులకు నచ్చజెప్పారు. భక్తుల సమస్యలను భాజపా నాయకులు ఎస్సై దృష్టికి తెచ్చారు.

స్తంభం.. ప్రమాదకరం



మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. లింగాల వైపు వెళ్లే వాహనదారుల రాకపోకలకు కూడలి మలుపు వద్ద ఇరుకుగా మారడంతో ఇక్కడ విస్తరించారు. దీంతో అక్కడే ఉన్న ఓ విద్యుత్తు స్తంభాన్ని తొలగించలేదు. ఇప్పటికైనా విద్యుత్తు స్తంభాన్ని తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెలకపల్లి**

కోతుల బెడదతో కొమ్మలు నరికి..



కోతుల బారి నుంచి పంటలను కాపాడుకొనేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పొలాల్లో చేరి పంటను నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. రైతులు గమనించి అదిలిస్తే చెట్లపైకి చేరి తప్పించుకుంటున్నాయి. దీంతో రైతులు పొలాల్లోని చెట్ల కొమ్మలను నరికేస్తున్నారు. వెంకటేశ్వర్లబావి సమీపంలో ఓ పొలంలో కొమ్మలు నరికేసిన చెట్టు ఇలా కనిపించింది. **- న్యూస్‌టుడే, అమ్రాబాద్**